

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### కలారి యుద్ధం... కథాకళి నృత్యం

**పెరట్లో అరటి పిలక నాటితే,** ఇక తిరిగి చూసుకోనక్కర్లేదని మా అమ్మమ్మ అంటుండేది. ఒక పిలక వేస్తే, అదే పనిగా కుటుంబ నియంత్రణ లేకుండా పిల్లల్ని పెట్టుకుంటూ పోతుంది. అవన్నీ ఏపుగా ఎదిగితే, పెరట్లోకి వెళితే పచ్చని తోరణాలు కట్టినట్లూ, నెమలి పింఛాలు విప్పినట్లూ ఎంత అందంగా ఉంటాయో!

మా చిన్నతనంలో అతిథులు ఎక్కువగా వచ్చేవారు. 'అతిథి' అంటే తిథీ వార నక్షత్రాలు చూసుకోకుండా, ముందుగా చెప్పకుండా వచ్చేవాళ్ళు అని అర్థం. ఇప్పుడు కొడుకు ఇంటికి వెళ్ళాలంటే పది ఫోన్లు చేసి, కొడుకూ, కోడలూ ఇంట్లో ఉంటారా, వేరే ఎవరినైనా పిలిచారా అని కనుక్కుని వెళ్ళాల్సొస్తోంది ఎవరికైనా. అప్పట్లో అలా కాదు. తెల్లవారు ఝామున నిద్ర మెలుకువ వస్తూ ఉంటే వంటింట్లో కుంపటి వెలిగించి మా అమ్మమ్మా, ఇంకా కొన్ని కొత్త గొంతులూ కబుర్లు చెపుతుండడం వినిపించేది. అంటే ప్రొద్దుటే వచ్చిన రైలుకి ఎవరో చుట్టాలొచ్చారన్నమాట. వాళ్ళొస్తే మనం బడికి వెళ్ళకపోయినా మా హిట్లర్ అమ్మమ్మ పట్టించుకునేది కాదు. పైగా వాళ్ళు పండ్లో, బిళ్ళలో ఏవో ఒకటి పట్టుకుని వచ్చేవారు. ఒక్కోసారి మార్నింగ్ షో సినిమాలకి కూడా వెళ్ళే ఛాన్స్ దొరికేది. అందుకే ఆ అతిథులంటే మాకు బోలెడు ప్రేమగా ఉండేది. అలాంటప్పుడు మా అమ్మమ్మ పెరట్లోకి వెళ్ళి గెలేసిన చెట్టునుండి రెండు అరటికాయలు కోసుకొచ్చి వేపుడు చేసేది. ఇంకా కొంచెం టైం ఉంటే ఆవపెట్టి కూర వండేది. చెట్టు కొట్టేస్తే దూట తెచ్చి సన్నగా తరిగి పెరుగుపచ్చడికానీ, పెసరపప్పు వేసి కూరకానీ చేసేది. అతిథులకి అరిటాకు పరిచి, ఎంత రాత్రి వచ్చినా రెడీగా ఆవకాయ, కందిపొడీ, అరటికాయ వేపుడుతో అన్నం పెట్టేది! అరిటాకులో ఆవిర్లు కక్కే ఇడ్డెనులూ, (అది అమ్మమ్మ ఇడ్లీలన్నమాట) అల్లం పచ్చడిలో గారెలూ ఎంత బాగుంటాయో? ఇవన్నీ మన పెరట్లో కల్పవృక్షం లాంటి అరిటి చెట్లు ఉంటే సాధ్యం. అలాంటి అరిటి అల్లిబిల్లిగా, అడ్డూ అదుపూ లేకుండా దట్టంగా అడివిలా పెరిగి, ఇళ్ళకి కంచెల్లా, నగరానికి కవచంలా, రాష్ట్రం అంతా దట్టంగా ఉంటే ఎంత బాగుంటుంది? అలా ఉంటుంది కేరళ రాష్ట్రం! గోడల మీద నుండి అరిటి గెలలు బయటికి వేళ్ళాడుతూ కనిపించాయి. అటు పక్క కొబ్బరి చెట్లూ ఇటుపక్క అరటి చెట్లూ! ఇళ్ళూ, మనుషులు తక్కువా, చెట్లు ఎక్కువా!

ఊరికే అన్నారా "గాడ్స్ ఓన్ స్టేట్' అని! ఆయనకి పక్షపాతం ఎక్కువే అనిపించింది కేరళలోకి అడుగుపెట్టగానే. కొచ్చిన్ నుండి మున్నార్ వెళ్ళడం ఒక అద్భుతమైన అనుభవం. కారు కొన్ని చోట్ల నిలువుగా నిలబడినట్లు వెళుతూ ఉంటుంది. కొన్నిసార్లు సడెన్‌గా కిందకి

'జైంట్ వీల్'లా దిగిపోతూ ఉంటుంది. డ్రైవరుకి ఎంతో చాకచక్యం అవసరం. ఎదురు ఏ వెహికల్ వచ్చినా తప్పుకునే జాగా లేక చాలా దూరం వెనక్కి వెళ్ళాల్సొస్తూ ఉంటుంది! పది తిరుపతుల పెట్టులా 'హెయిర్ పిన్ కర్వ్స్' ఉన్నాయి. కానీ అటూ ఇటూ లోయల్లో సుగంధ ద్రవ్యాల తోటలు, మనసుని ఉల్లాస పరుస్తూ ఉంటాయి. ఇలాచీ, లవంగం, దాల్చిన చెక్కా, మిరియం, కోకో, కాఫీ, టీ, రబ్బర్, బాంబూ, నీలగిరీ ఒక్కటేవిటీ, రకరకాల వృక్షాలు విరివిగా పెరిగే నేల అది! ఒక పక్క కొండలమీద నుండి జారిపడే జలపాతాలు.. నీటికి కొదవలేదు, గాలికి ఎల్లలు లేవు, వనాలకి అదుపు లేదు. అంత ప్రకృతిని తనివితీరా చూడడానికి రెండు కళ్ళూ చాలవు. అందుకే అనిపించింది దేవుడు పక్షపాతి అని! షంషాబాద్‌తో పోలిస్తే కొచిన్ ఎయిర్ పోర్ట్ చాలా చిన్నది.



కొచ్చిన్‌లో 'మెర్ మెయిడ్' హోటల్ లో దిగి, ఆ టైంలో అక్కడ భోజనం దొరకదని తెలిసి దగ్గర్లో ఉన్న షణ్ముఖాకి వెళ్ళాం.

భోజనం అనగానే ఇంతలావు బియ్యపు అన్నం పట్టుకొచ్చాడు. కానీ ఆధరువులు చాలా బావున్నాయి. నాకు పేర్లు తెలీవు - వాళ్ళకి చెప్పడానికి 'లిటిల్ హిందీ.. లిటిల్ ఇంగ్లీషూ' మాత్రమే వస్తుంది. అందులో రెండో మూడో అరటికాయితో, అరటిపండుతో చేసినవి ఉన్నాయి. అరిటి పండు ఆవపెట్టి తియ్యని కూర చేసాడు. అది నాకు చాలా నచ్చింది. పాపడం.. అప్పడం కాదండోయ్... అది కేరళ ప్రత్యేకత. అవి చాలా బాగుంటాయి.. కొబ్బరి పాలు వెయ్యకుండా ఏ వంటకం దాదాపు పూర్తి అవదు! వాళ్ళకి 'కోకోనట్' అంటే ఎంత ఇష్టం అంటే, ఆ హోటల్‌లో బార్ పేరు కూడా 'కోకోనట్ డ్రంకెన్ బార్'!

రాత్రి నేప్‌కిన్‌కీ టవల్‌కీ మధ్యస్థంగా ఉన్న సైజులో బట్టలు కట్టుకున్న అమ్మాయిలు అందులో పాటలు పాడడానికి వెళ్ళారు. ఎంట్రీ ఫీజు 500/ - అన్నారు. మా వారు సరదా పడినా నేను ఒప్పుకోలేదు. కావాలంటే ఆయన ఒక్కడ్నే వెళ్ళమన్నాను. ఆయన వెళ్ళలేదు పాపం!

మా పెళ్ళి అయిన మరునాడు మేం ఇద్దరమే తిరుపతి వెళ్ళాం. ఆ తరువాత ఎప్పుడూ పిల్లలు లేకుండా మేం ఇద్దరమే ఊరికి వెళ్ళిన సందర్భం కానీ అవసరం కానీ రాలేదు. పాతికేళ్ళ తరువాత పిల్లలూ, మా అత్తగారూ, వాళ్ళ అత్తగారూ ఎవరూ లేకుండా ఇద్దరమే వెళ్ళిన రెండో హనీమూన్ ఇది!

హనీమూన్ మొదటిసారి వెళ్ళినప్పుడు బోలెడు కబుర్లు ఉంటాయి! ఎందుకంటే ఒకరి గురించి ఒకరికి ఏమీ తెలీదు కాబట్టీ! ఈ రెండో హనీమూన్లో నేను చెప్పేవాటికి నా హావభావాలూ, ఆయనకి మనసులో బోలెడు లాంగ్వేజి ఉంటుంది. అందుకే మాట్లాడకుండా కారులోంచి తలలు బయట పెట్టి ప్రకృతిని ఆస్వాదించగలిగాం. దాదాపు ఐదు గంటలు ప్రయాణం చేసిన తరువాత బర్డ్స్ వాలి అనే రిసార్ట్స్‌లో దించేసాడు.

కారు దిగితే కాలుజారి లోయలో పడిపోయేటట్లు ఆపాడు. అసలు కాలినడకన మున్నార్‌లో ఎక్కడికైనా వెళ్ళడం అసాధ్యం. అంతా కొండ ప్రాంతం.

ఉప్పూ, కారం అనేవి మచ్చుకైనా కానరాని చపాతీలూ, కూరా, నూడిల్స్ ఏదో పట్టుకొచ్చాడు. రాత్రికి బఫే అన్నాడు.

ఇద్దరం ఆ కొండమీద కూర్చుని ఒక్కొక్క చెట్టు గురించీ చాలాసేపు మాట్లాడుకున్నాం. ప్రకృతి మీద శ్రద్ధలేని వాళ్ళకి మాత్రం అలా కూర్చోడం బోర్ కొడుతుంది. అరకు వేలీ తీసుకెళుతుంటే మా పెద్దాడు నిద్రపోయాడు. "అరే! ఎంత అందంగా ఉంటుందో..

బయటకి చూడరా..'' అని ట్రైనులో నేను గొడవ పెడితే 'అదిగో చెట్టు.. మళ్ళీ చెట్టు.. ఇంకో చెట్టు, చెట్టు పక్కన చెట్టు..'ఇలా ఎంత సేపు చూపిస్తావు అని విసుక్కున్నాడు - మా అశ్విన్.



మా ఆయన విసుక్కోలేదు. ఆ పసుపు పూలూ, ఎర్రపూలూ అన్నీ తెచ్చి నా తలలో పెట్టి, రకరకాల ఫోటోలు తీసారు. ఆయన ఫోటో తీసేటప్పుడు నవ్వమని చెప్పడానికి ''మీ అక్కలతో మాట్లాడేటప్పుడు నవ్వినట్లు నవ్వూ.. మీ ఉమతో కలిసున్నప్పుడు ఎలా మొహం పెడతావో అలా పెట్టూ'' అని 'తింగరగా' అని అర్థం వచ్చేట్లు, చెప్పకనే చెప్పి బోలెడు ఫోటోలు తీసారు.

సాయంత్రం బఫేకి కిందకి వెళ్ళడానికి ఒకళ్ళ చేతులు ఒకళ్ళం పట్టుకున్నా, జర్రుమని జారిపోతూ వెళ్ళి ఎలాగో అక్కడ మెస్‌లో పడ్డాం!

ముంబైనుండి ఓ ఎయిర్ బస్సు వేసుకుని జైనులు కొందరు పిల్లా పీచూ, ముసలీ ముతకాతో దిగారు. వాళ్ళకోసం ఆ వేసే ఒక చెంచా ఉప్పూ, కారం కూడా మానేసాడు వంటవాడు.

మా ఆయన ''ఇక్కడ చపాతీలున్నాయి. చాలా బావున్నాయి తిను'' అని తీసుకొచ్చి నా ప్లేట్లో వేసారు. నాకు అవి చూడగానే అవి ఆ జైన్స్ తెచ్చినవి అని అర్థం అయిపోయింది.

''ఏ ఆప్ కా హై బెహన్ జీ?'' అని ఒక పెద్దావిడని అడిగాను. ఆవిడ నవ్వి'' ఖానే కీ చీజ్  హై ఖాలో'' (తినే వస్తువులు తినండి) అంది. వాటిని 'టేఖ్‌డీ'లంటారు. గుజరాతీస్ సెనగపిండీ, వరిపిండీ కలిపి గట్టిగా చపాతీల్లా, మసాలా వేసి చేస్తారు. అవి పదిరోజులదాకా పాడయిపోకుండా ఉంటాయి. అని ఆవిడ ఎక్స్‌ప్లైన్ చేసింది. ఆవిడ పేరు 'కపిలా బెన్'. హైదరాబాద్ నుండి వచ్చాం అని తెలుసుకుని చాలా సంతోషపడ్డారు. హైదరాబాద్ వచ్చి రామోజీ ఫిల్మ్ సిటీ చూడాలని ఉబలాటపడ్డారు. అన్నదమ్ములు కలిసి ఉండడం, ఉమ్మడి కుటుంబాల వాళ్ళు ఆనందంగా విహారయాత్రలు కూడా, పిల్లలతో, మనవలతో కలసి చెయ్యడం 'నార్త్'లోనే చూస్తాం! లేదా సంజయ్ లీలా భన్సాలీ సినిమాల్లో చూస్తాం! ఆ పెద్దన్నగారు, డెబ్భైఏళ్ళుంటాయి ''ముంబై వస్తే మా ఇంటికి రావాలి. మాకు రబ్బర్ ఇండస్ట్రీస్ ఉన్నాయి. కపిలాంటీ మిమ్మల్ని వదిలి పెట్టదు. ఒకసారి వస్తే మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉంటారు.'' అని ప్రేమగా ఆహ్వానించారు.

ఆయన తమ్ముడు అశోక్. ఎమ్. షా.. ఎయిర్‌పోర్టునుండి ఫోన్ చేస్తే కారు పంపిస్తాను. మా ఇంట్లోనే దిగాలి. చాలా పెద్ద ఇల్లు అని కూడా ఆఫర్ చేసేసాడు.

కలిసున్న రెండుపూటల్లో మేం చాలా కబుర్లు చెప్పుకున్నాం. పోచంపల్లి పట్టుచీరల నుండీ, ఆలూరులో జైన్ దేవాలయం వరకూ. వాళ్ళు 'ఉల్లీ, వెల్లుల్లీ' కూడా తినరు. అంత నిష్ఠ.

శ్రీకాంత్ అనే సర్వింగ్ చేసే బోయ్ నా సెల్‌లో ఉన్న మా 'అందరి బంధువయా' హీరోయిన్ పద్మప్రియ ఫోటో చూసి తెగ ముచ్చట పడ్డాడు. పద్మ ప్రియ మలయాళంలో చాలా ఫేమస్ హీరోయిన్. అక్కడ అందరూ 'అల్లు అర్జున్' ఫ్యాన్స్!

తరువాత రోజు బ్రేక్ ఫాస్ట్‌లో రోస్టెడ్ ఇడ్లీ కూడా పెట్టారు. అదయ్యాక మా వారు 'డామ్' చూద్దాం రా' అన్నారు. ''డామ్ బోర్.. మీరెళ్ళండి' అన్నాను. ఆయన కెమేరా వేసుకుని వెళ్ళిపోయాకా నేను తరువాత చేస్తున్న సబ్జెక్ట్ ట్రీట్ మెంట్ రాసుకుంటూ

కూర్చున్నా. చుట్టూ ఉన్న చెట్ల మీద పక్షులు 'సైలెన్స్' పాటిస్తూ తెగ మేనర్స్ చూపించాయి. మా ఆయన రాత్రి వరండాలో లైట్ వేసి మర్చిపోవడంతో, ప్రొద్దుటే రకరకాల పురుగులు వచ్చి చచ్చిపడి ఉన్నాయి. ఆ 'బ్రేక్ ఫాస్ట్' కోసం రంగురంగుల పక్షులు వచ్చాయి. కానీ 'మునుల్లా' శాంత గంభీరంగా వాటి పని అవి చేసుకుని ఎగిరిపోయాయి. మా సైనిక్‌పురిలో ఆరుగంటలకి పక్షులు చెట్లమీదకి తిరిగొచ్చి వీధికొళాయిల దగ్గర ఆడవాళ్ళల్లా పోట్లాడుకుంటాయి. మనిషీ మనిషీ మాట్లాడుకుంటే వినిపించనీయవు! ఇవి వాటికి పర్సనాలటీ డెవలప్ మెంట్ క్లాసులు తీసుకోవాల్సిందే!

మేం మరునాడు అక్కడ నుండీ 'టెక్కడీ' మళ్ళా ఐదు గంటలు ప్రయాణం చేసి వచ్చాం. మా కారు డ్రైవర్ పేరు అనిల్, భలే మంచి ఫోటోగ్రాఫర్. (ఇలా అంటే మా ఆయన అలిగారు కూడా!) మమ్మల్ని దార్లో చాలా చోట్ల ఫోటోలు తీసాడు. జలపాతాల్ని పైపుల ద్వారా పీపాల్లో పట్టి జనాలు వాడుకుంటారు. మంచినీళ్ళు.. వాటికి సుగంధ ద్రవ్యాల వాసన! వాళ్ళు ప్రకృతి పుత్రులు! ఆ లోయలలోకి చూస్తూ కొండల మీద నుండి దిగుతుంటే, అక్కడక్కడా ముసలమ్మలు కూర్చుని దీక్షగా తేయాకు కోయడం కనిపిస్తుంది! ఆ నుదుటి మీద ముడతలకూ, ఆ వణికే చేతివేళ్ళకూ ఆ పని గత అరవై వసంతాల నుండీ అలవాటేమో అనిపించింది!

'టెక్కడీ' అంతా అడవి ప్రాంతం. ఆ అడవిలో టూరిస్ట్‌ల కోసం నిర్మించిన ఊరు. 'మెడోస్ వ్యూ' అనే గెస్ట్ హౌస్ లో దిగాం. "దానిపై అంతస్తు వి.ఐ.పీలకే ఇస్తాం. మీ ట్రావెల్ ఏజెంట్ వి.ఐ.పీ అని మరీ మరీ చెప్పాడు అందుకే ఇస్తున్నాను, జనరల్ గా యూరోపియన్స్ కి మాత్రమే ఇస్తాను "అని సతీష్ అనే ఆ గెస్ట్‌హౌస్ ఓనర్ వచ్చీరాని ఇంగ్లీషులో చెప్పాడు. అతను ఆ ఫారెస్ట్‌లో రీసెర్చ్ ఆఫీసర్ కూడానూ! ఏనుగుల మీద రీసెర్చట.



ఆ పర్ణశాల లాంటి చెక్కలతో కట్టిన కాటేజ్ ఎంతో బావుంది. చుట్టూ అడవి. అంతా ఫారినర్సే దిగారు.

ఆ వైల్డ్ ఏనిమల్ ఫారెస్ట్ టూర్‌లో నాకు బాగా నచ్చిన అంశం బోటింగ్. మాకు నీళ్ళల్లో వెళుతూ ఉంటే, ఏనుగులూ, దుప్పలూ, అడవి దున్నలూ, అడవి పందులూ, రకరకాల పక్షులూ దండులు దండులుగా కనిపించాయి. కింగ్ ఫిషర్స్ చేపల కోసం దొంగ తపస్సు చేస్తున్నట్లు నీళ్ళమీద విరివిగా కనిపించాయి.

టేక్‌డీలో దిగగానే మనకి బాడీ మసాజ్ చేసే పార్లర్లూ, కలారీ ఫైట్స్, కథాకళి నృత్యాలకి సంబంధించిన టికెట్స్ చాలాచోట్ల అమ్ముతూ కనిపిస్తారు. కలారి యుద్ధం అంటే ఒక రకమైన మార్షల్ ఆర్ట్స్. కత్తి డాలుతో గాలిలోకి ఎగిరి అక్కడే కొట్టుకుని కింద పడుతూ విన్యాసాలు చేస్తుంటారు. కొంచెం భయంగానే ఉంటుంది!

ఇంక కథాకళి నృత్యం అందరికీ తెలిసినదే ఆర్టిస్టులకి త్యాగపూరితమైన మనస్సు ఉండాలి. ఎందుకంటే వాళ్ళ అసలు మొహాలు మనం చూడలేం. ఈ మాటే నేను సినిమాల్లో జాంబవంతుడూ, తుంబురుడూ లాంటి వేషాలు వేసే వాళ్ళ గురించి అనుకుని బాధపడుతుంటాను. అసలు మొహానికి రంగు వేసుకునేదే నలుగురికీ కనపడడానికి కదా!

లావు తగ్గడానికీ, ఎన్నో ఏళ్ళుగా ఉన్న కొన్ని వ్యాధులకి కేరళా ఆయిల్ మసాజ్‌లో శాంతి గిరి అనే చోట్ ఫేమస్. ఇరవై ఒక్క రోజు ఉంటే, ఆహార నియమాలన్నీ వాళ్ళు చెప్పినట్లే చేస్తే ఫలితం చాలా బావుంటుందట!

టెక్కడీ నుండి మళ్ళీ కార్లో నాలుగు గంటలు ప్రయాణం చేసి అలెప్పీ వెళ్ళాం. మా వారు టెక్కడీలోని బాల్కనీలో నిలబడి అక్కడ కనిపించిన అడవి దుప్పుల్ని చూపించి "ఇది డెలివరీ కోసం అడవిని వదిలి ఇంత దూరం వచ్చింది. ఆ పక్కనున్నది మగదుప్పి" అని చెప్పారు. "మీకెలా తెలుసు?" అనే పరమ వెధవ ప్రశ్న నేను వేసాను.

"నాకు ఫేస్ రీడింగ్ తెల్సురా" అన్నారు.

"నా ఫేస్ రీడింగ్ తెలుసా?" అని అడిగాను.

"తెలుసు. నేను పట్టించుకోను" అన్నారు.

నాకు చచ్చే నవ్వొచ్చింది. నా ఫేస్‌లో ఏం పలుకుతాయో ఆయనకి అర్థం అవుతుంది అన్నందుకు.



ఇలా టెక్కడీ నుండి అలెప్పీ వెళుతుండగానే, హౌస్ బోట్‌లో నుండి 'లంచ్ సిద్ధం' అన్న కాల్ వచ్చింది.

అందమైన హౌస్ బోట్లో ఒకే బెడ్ రూం, అందులోనే టాయిలెట్, సెపరేట్ లివింగ్ ఏరియా అందులో టీవీ, డైనింగ్ టేబుల్ అన్నీ ఉన్నాయి.

బోట్ నడిపే కుర్రాడి పేరు జోబిన్. వంట వాళ్ళు శీనూ, అసిస్టెంట్ కుమార్. వెళ్ళగానే ఒక కొబ్బరి బొండాం కొట్టి ఇచ్చారు. ప్లేట్లో అనాసపండు చాలా అందంగా డిజైన్‌లో తరిగి పెట్టాడు. కొన్ని అరటిపండ్లూనూ! అరటి పండు ముక్కలుగా తరగచ్చు. కసుక్కున తరగపడుతుంది. కానీ చక్కెరలా తియ్యగా ఉంటుంది.

ఓ గంటలో రకరకాల కూరలూ, పాపడం, సాంబారూ పెరుగుతో భోజనం పెట్టాడు. నీళ్ళల్లో వెళుతూ అలా భోజనం చెయ్యడం ఓ వింత అనుభూతి.

తరువాత నేను గదిలోకి వెళ్ళి నిద్రపోయాను. మావారు చాలా సేపు ఆ 'క్రూ'తో మాట్లాడారు. రాత్రికి ఏవో డీ.వీ.డీలు వడ్డు దగ్గరున్న షాపులో కొని ఇంగ్లీషు సినిమాలు చూసారు. నేను యథాప్రకారం తెచ్చుకున్న కాయితాలు అయిపోయేదాకా స్క్రీన్‌ప్లే రాసుకుంటూ కూర్చున్నాను. రాత్రి బోట్ ఆపేసాడు.



తెల్లవారు ఝామున మళ్ళీ పడవ ప్రయాణం మొదలూ. మంచి ఇడ్లీలూ, కొబ్బరి పాలూ, సాంబారూ, ఆమ్లెట్లూ, టీ బ్రేక్ ఫాస్ట్‌కిచ్చాడు. మొత్తం రెండు భోజనాలూ, ఒక బ్రేక్ ఫాస్టూ. కేరళా ట్రిప్ మొత్తంలో రుచి అయిన వంట బోట్‌లోనే తిన్నాం. వాళ్ళు వలవేసి కొన్ని చేపలు కూడా పట్టుకున్నారు.

"మీ ఆంధ్రప్రదేశ్ నుండి గొప్పవాళ్ళే కాదు. సామాన్యులూ, మధ్య తరగతి వాళ్ళూ కూడా ఇలా విహార యాత్రలకి వస్తారు. నాకు తెలుసు. మేం అలా ఖర్చు పెట్టం" అన్నాడు జోబిన్. అది పెరియార్ లేక్. అక్కడే ప్రతి సెప్టెంబర్ రెండో శనివారం నాడు 'నెహ్రూ ట్రోఫీ బోట్ రేసులు' అవుతాయి.

వందల తెడ్లు వేస్తూ బోట్ రేసులు జరపడం మనం టీ.వీల్లో చూస్తాం కదా!

కేరళలో అక్షరాస్యత ఎక్కువ అంటారు. కానీ మాకు తారసపడిన ఈ సిబ్బంది ఎవరికీ సరైన ఇంగ్లీషు రాదు! హిందీ అయినా వాళ్ళు బాగా నేర్చుకోవాలి, ఎందుకంటే అది పర్యాటకుల మీదే ఎక్కువగా ఆధారపడిన ప్రదేశం కాబట్టి. ఇలాంటి చోట్ల నా వచ్చీరాని తమిళం చాలా వరకూ సహకరిస్తుంది. కానీ అక్కడ ప్రజలంతా కష్టజీవులు. ఈ విషయం మనకి దేశవ్యాప్తంగా తెలుస్తుంది. నేను నా పెళ్ళికాక ముందు 'షిల్లాంగ్' వెళితే అక్కడ ఓ చోట దోశెలు వేస్తూ మలయాళీ కనిపించాడు. వాళ్ళు ఎంత కష్టజీవులో చెప్పడానికి కోడిరామకృష్ణగారు 'స్టేషన్ మాస్టర్' సినిమాలో ఓ పాత్ర కూడా పెట్టారు. టీస్టాల్ నడుపుతూ 'నువ్వు మారుమూల ఊళ్ళోకి కేరళ నుండి ఎలా వచ్చావు?' అని ఎవరైనా అడిగితే చెప్పు చూపిస్తూ ఉంటాడు రాజన్ అనే కేరక్టర్. ఆ చెప్పు ఎందుకంటే, మా నాన్న చెప్పుతో కొట్టి, 'పోయి ఎక్కడైనా పని చేసుకుని బతుకు, నా మీద ఆధారపడకు అన్నాడని చెప్పలేక!' అలా వీళ్ళ వలసపోతూ ఉంటారు. మాకు మలేషియాలో కూడా చాలా మంది కనిపించారు. నార్త్ ఇండియా అంతా సౌత్ ఇండియన్ హోటల్స్ నడుపుతూ కనిపిస్తారు.

నేను టెక్కడీలో కేరళా ఓనమ్ శారీస్, కొచ్చిన్‌లో కొన్ని చీరలూ కొన్నాను. ఇంకా ఏనుగు బొమ్మలూ, కథాకళీ బొమ్మలు కూడా గోడకి పెట్టుకునేవి కొన్నాను. ఆదివారం మా ఎలక్ట్రీషియన్ వచ్చి గోడకి పెట్టాడు కూడా!

అరటికాయ చిప్స్ మాత్రం మా డ్రైవర్ అనీల్ ఎక్కడా కొననివ్వలేదు. అవి తమిళనాడువి. కేరళా కొబ్బరినూనెవి కావు! అన్నాడు. అలెప్పీలో ఓ షాప్ కి తీసుకెళ్ళి 'ఇవి మా కేరళా చిప్స్... ఇది కేరళా అరటికాయ' అని గర్వంగా చెప్పాడు.

మేం కొచ్చిన్ చేరేటప్పటికే మధ్యాహ్నం అయింది. ఇంకా తిన్నగా వెళితే త్రివేండ్రం, కన్యాకుమారీ వస్తుంది అని చెప్పాడు కొచ్చిన్‌ని ఎర్నాకులం అని కూడా అంటారు. కొచ్చి అనీ పిలుస్తారు.

అనిల్‌కి మా ఆయన ఎనిమిది వందలు టిప్‌గా ఇచ్చారు. అసలు ఎంత అయినా ఇవ్వొచ్చు ఆ లోయల్లో, కొండల్లో, ఇరుకు ఇరుకు దారుల్లో ప్రాణాలు రిస్క్ చేసి నడిపిస్తారు వాళ్ళు!

కొచ్చిన్ ఎయిర్‌పోర్ట్ నిండా రకరకాల ఫ్లైయిట్స్ కోసం ఎదురు చూస్తున్న జనాలతో, అధిక సంఖ్యలో ఉన్న ఫారెనర్స్‌తో ఇంకా ఇరుగ్గా కనిపించింది. ఎక్కువగా ఫ్రెంచ్ వాళ్ళు స్థానికులుగా ఉంటారు.



కొచ్చిన్‌లో వాస్కోడిగామా సమాధీ, చర్చ్‌లూ, బీచ్, మ్యూజియం సందర్శనా స్థలాలు. ముఖ్యంగా పరిశుభ్రత ఉంటుంది. చేతులతో ఏదీ వడ్డించరు. పబ్లిక్ టాయ్‌లెట్స్ సైతం నీట్ గా ఉంటాయి.

కొచ్చిన్ నుండి బయలుదేరిన తరువాత ఊరిచివరనున్న 'చట్టనిక్కరా దేవి, భగవతి' ఆలయాలకి వెళ్ళాం. బయట ముసలమ్మ కలువ పూలు తీసుకొచ్చి ఇచ్చి డబ్బులియ్యకపోయినా పరవాలేదంది మళయాళంలో. అయినా నేనూ 50 రూపాయలిచ్చి గుడిలోకి వెళ్ళాం. వెళ్ళాక పేలాలు, వడ్లు అక్కడ పెట్టి అమ్మవారి మీద వేయించడం అక్కడి ఆచారం.

'చీకటి పడేలోపు చూడాల్సింది అంతా చూసేసెయ్..... పళ్ళు ఊడే లోపు తినాల్సినవి అన్నీ తినేసెయ్' అన్నది చైనా సామెత కాదు! నేను కనిపెట్టినది.. కానీ ఎవరికైనా నచ్చాలంటే అది చైనాదో రష్యాదో అని చెప్పాలి!

అలా శరీరం మనం చెప్పినట్లు వినే టైంలోనే తీరిక చేసుకుని కొత్త ప్రదేశాలు చూస్తుండాలి.

ఒక మనిషికి నది వడ్డున ఒక ఇల్లుందిట. అతనికి సిటీకి వెళ్ళడం, కావలసినవి కొనుక్కోవడం, జనం ఎక్కువగా కనిపించకపోవడం, చాలా చిరాకు తెప్పించి, బోర్ కొట్టి అమ్మేసి సిటీకి పోదాం అని ఓ నాలాంటి స్నేహితుడ్ని పేపర్లో ఇల్లు అమ్మకానికి పెట్టినట్లు ప్రకటన ఇమ్మన్నాడట. అతను ఓ వారం రోజులు, ఇవాళా, రేపూ అని... చివరకి రాసి పట్టుకొచ్చాడట. అది ఇలా ఉందట.

"నా ఇంటికి వెనుక వైపు వేగంగా ప్రవహించే నది.. మనిషి జీవితానికి ఒడి ఎంత ముఖ్యమో చెపుతుంటుంది! చుట్టూ పచ్చని చెట్లు, మనిషికి ఎంత సేవ చేసినా అలసిపోము అన్నట్లు ఉంటాయి. సాయంత్రాలు నా కిటికీ తలుపు తెరిస్తే పక్షులు పాడే సంగీతం ముందు ఏ కచ్చేరీ అయినా దిగదుడుపే! సంధ్య వేళ అస్తమించే సూర్యుడు పచ్చని చీర కట్టుకున్న భూదేవికి తిలకంలా ఉంటాడు. కొండ మీద నుండి వచ్చేగాలి ప్రతిరాత్రీ నాకు జోలపాటలు పాడి నిద్రపుచ్చుతూ ఉంటుంది. ప్రతి వస్తువూ నేను చాలా దూరం నడిచి వెళ్ళి తెచ్చుకోవడం వల్ల నాకు మంచి వ్యాయామం దొరుకుతోంది. ఈ ప్రకృతి వరాల వల్ల రుచి అయిన ఆహారం, అది జీర్ణం అయ్యే ఆరోగ్యం లభిస్తోంది. నా నాలుగు గదుల చిన్న ఇల్లూ.. చుట్టూ ఉన్న విశాలమైన తోటా.. వీటన్నింటితో బాటూ అమ్మేసి పోదాం అనుకుంటున్నాను. మీకు ఆసక్తి ఉంటే ఈ చిరునామాకి రాయండి' అని ఉందట.

అది చదివిన ఆ వ్యక్తి కాయితాన్ని పెట్లో దాచేసి "థాంక్స్.. నేను ఏం పోగొట్టుకోవాలని అనుకున్నానో చెప్పి నా తెలివి తక్కువ తనాన్ని ఎత్తి చూపించావు. చచ్చినా అమ్మను" అన్నాడట స్నేహితుడితో.

అలా మన దేశంలో.. మనకి పొరుగునున్న అందమైన ప్రదేశాలు మనం చూడం. ఒక్కోసారి వాటి విలువ తెలీదు. ఇలా వెళ్ళినప్పుడే అనిపిస్తుంది. మన భారతమ్మ జడలో ఎన్ని సంస్కృతుల చేమంతు లో! జారుపైట మీదుగా ఎన్ని పేట్ల చంద్రహారాలో అని!

***

**NEW**
Click here to share your comments on this article